# అవతారం

శ్రీ యస్వీ జోగారావు

'ఓం పూర్ణమదః పూర్ణమిదం
పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ
పూర్ణమేవావశిష్యతే'

అది హిమాలయము కాదు మహిమాలయము.

అది పరమేష్ఠి చరాచర సృష్టి శిల్పకల్పనాపటిష్ఠతకు పరాకాష్ఠ.

అది పురాణదంపతులు జగత్పితరులు నగు పార్వతీ పరమేశ్వరుల చిరంతన పరంధామము. కామవాసనలు నశించిన వారి ప్రేమ కది పరసీమ.

శివదేవుని అభయహస్త శుభముద్రలచే ఆదిగర్భేశ్వరి యగు అపర్ణ తపఃఫలముగా సంభవించి శాంభవ తేజము జగ మఘాతుకముగా విజృంభించిన రంగభూమి.

భగీరథ ప్రయత్నమున దివినుండి దిగిన గంగాభవాని తరంగ తాండవ ప్రథమభంగిమ కది యాధారపరిధి.

అది దేవతాత్మ.

పూర్వాపరసాగరాంతర పరివ్యాప్త మహీమండల మానదండము.

సృష్టిలో నెల్ల స్వచ్ఛతకు, సౌందర్యమునకు, ఔన్నత్యమునకు, ఆధిక్యమునకు అనుత్తమోపమానము.

అది ఆనేక నదీమతల్లులకు పుట్టినిల్లు.

ఓషధుల నిధి.

రత్నముల నిక్షేపము.

అప్సరసల కాటపట్టు.

సిద్ధుల తపోనిష్ఠ కధిష్ఠానము.

గంధర్వుల గానవిద్యాసాధనకు నిదానము.

విరహవిధుర హృదయులగు యక్షప్రేయసీ ప్రియుల రాయబారులకు మధ్యేమార్గ ప్రపాకాలు.

* * *

అట నవిముక్తమువలె నొక విశాల వివిక్త ప్రదేశము.

అది యొక పద్మని పర్వతోపత్యక. నలువంకల పంక్తులు తీరిన పర్వతములు—ఉత్తుంగ శృంగములు—కైలాస, కాంచనగంగా, గౌరీశంకర నందాదేవీ, ధవళ త్రిశూల శైలరాజములు,... ఆ పర్వతసానువులపై పరమేశ్వరు నొడలినుండి దిగజారు నాగులవలె నదులు, వాగులు. సాంద్రాతిసాంద్రమగు నొక భూరికాంతార భూమి నావరించియున్న ఆ గైరిక ప్రాకారము నడుమ నదీజలముల బొదివిపట్టు మనోహరమైన మానససరోవరము.

అట ఆనాడెప్పటియట ఉదయగిరి శృంగముపై ఉషః స్ఫురణమైనది. కాని పరమేష్ఠి ప్రతిభ నవనవోన్మేషశాలిని. ఆ ప్రకృతి రామణీయకము నిత్య ప్రత్యగ్రము.

ఆ నాడెందులకో ప్రకృతి భగవతి యుగపదుల్లాసము నవధరించినది.

పుడమితల్లి పచ్చి పురిటాలివలె కడుపుచుమ్మలు చుట్టుకొన్నది.

సరిత్తుల సరోవరముల సాగరముల జలదేవతలు రాసక్రీడ లాడుకొనిరి.

తొలినాటి చరమ సంధ్యావేళ అస్త్రభట్టారకు నంతరంగమునం దంతర్భవించిన కేపుమాపుల యూపురేకలు దీర్చు కాంతిపుంజము నలనొక అకళించుకొని ఉదయభాస్కరు డున్నత్తుగా జగత్తు నొక క్రొత్తపోకడతో రకరకముల రంగు రంగుల పోహణింపులతో హావణించినాడు.

అంతదాక శిశిర విశీర్ణము లయ్యు వసంతాద్వాసంత సంతోషముతో వింతగా చిగిర్చిన ద్రుమములపై, ద్రుమముల నాశ్రయించి కొనలు సాగి వనలెత్తిన క్రొందీవలపై తావుల్ కొల్లగొనుచు విదజల్లుచు చల్లనిగాలి రివటలు చక్కిలిగింతలు పెట్టుచు పోయినవి.

ఆకస మకాలపర్జన్య గర్జానుస్ఫూర్తి ప్రకటించినది.

ఆ వేళ విధాత, అప్పటికే అనేక మూకజీవరాసుల జాతకము లేర్పరిచిన నేర్పరి ఒక్క అనిదంపూర్వ నవనవ జీవపదార్థ సృష్టి సంకల్పము చేసి, అంతర్ముఖుడై యోగసమాధిలో నున్నాడు. సహధర్మచారిణి వాణి చేదోడు వాదోడు కాగా ఆత్మసాక్షాత్కారము పొందిన మహాయోగివలె లేచి సంకల్పసిద్ధి పొందినవా డతడు.

ఆనాడెట పుడమితల్లి యొక క్రొత్త పురుడు పోసుకొన్నది.

* * *

అయ్యది స్వచ్ఛమూ సుభగమైన శుభసమయమున, ఆ ప్రాక్తన వృక్ష జీవన ప్రభాతవేళ అధోభాగము హిమావదాతమై ఉపరితల మరుణారుణ కుండలిత శిలామండలమై, శిఖరాంచలము సద్యోభ్యుదిత బాలభానుకిరణ కదంబోజ్జ్వలమై హిమనిర్ఝరోపక్రమ రమణీయమై శశాంక శేఖరుని జటాజూటమువలె గన్పట్టుచున్నది గౌరీ శిఖరము.

ఆ గిరిశేఖరముపై నదియొక విశాల శాద్వల తలము. చుట్టుపట్ల చెట్లుచేమలు చెలను చెసియున్నవి. పుడమి యొడలి పులకలవలె వనోద్భిదము లెసలెసల పొడసూపుచున్నవి.

అట నొకచో చీనాంశుకపు చిలిపిదుప్పి విసనకర్రలవలె నున్న వాలము లెత్తి మేతలు మేయుచు, గాలికి వాలుగా వినుక

కాళ్ళపై నిలబడుచు గనుపూయుచు పొత్తికళ్ళలో నొత్తుగా పెరిగిన బొమ్మకుచ్చెలలో కాళ్లు విర్చనకై జొనుపు కొనుచు గడ్డిరుబ్బులలో కొమ్ములతో గోరాడుచున్న చమరీమృగముల వాలకములు, చర్యలు చక్షుశ్శ్రావ్యములుగా నున్నవి.

మరియొకచో పొదరిండ్ల పొంత పక్కనిక్కి చూచుచు పొక్కిలి జాలెనుండి జారు మదపంకము పరిమళములు పరిసరములకు పంచిపెట్టెడు చిరుకోరల చిటిపొటి కొమ్ముల కస్తూరీ మృగవారము.

వేరొకచో సారవిష్కారములు సన్నగా సాహ్నాయిరాగము లాలపించుచున్నవి.

ఒక వల్మీకవితంబునుండి పిపీలికల బారులు దీరి శిఖరాభిముఖముగా పోవుచున్నవి. వల్మీక శృంగములపై చిరుగాలి సోకులకు శేలిహానములు లేచి పడగలు విప్పి యాడుచున్నవి.

ఒక రసాలసాలముపై ఫలగ్రహణ పరాయణములై కిశోర వానరములు శాఖాచంక్రమణములు చేయుచున్నవి.

అల్లంత దూరాన మానసకాసారమున కలహంసలు పద్మినుల పజ్జ చేరి తత్ప్రియబాంధవుని ప్రణయ సందేశములు నివేదించుచున్నవి.

అద్భుత మా వేళ యద్భుతముగా జరిగిన యొక ప్రాక్తన మహావ్యక్తి జీవన ప్రస్తావన.

* * *

అట నొక ఊడలమఱ్ఱి నీడలో ఉపవిష్టుడై ఊర్ధ్వముఖుడై రోమజటావ్యగ్రుడై ఒంటరిగా నొక వ్యక్తి.

ఆ వృక్షశాఖలనుండి వ్రేలాడు ఋషిపక్షుల విలక్షణ వీక్షణము లతని యూర్ధ్వదృష్టుల నాశ్చర్యముగా బలుకరించుచున్నవి.

అతడు దిగంబరుడు.

ఆకస మతని చుట్టు నావరించుకొనియున్నది. దిగంతమునుండి సహస్రారముదాక అతని అంతరంగపు టంతరాళ మంతయు వ్యాపించియున్నది. ఆ నడుమ నతని మనుగడ.

కాలెడు ప్రొద్దెక్కినది. పొగమంచు పటాపంచలైనది. అత డేదో సుదీర్ఘముగా నాలోచించుచున్నాడు.

ఒకింతసేపు వలువంకల కలయజూచి బావురు మనుచున్న ప్రకృతిని జూచి తన యొంటరితనమును దలచి భయభ్రాంతుడై యొక పెనుబొబ్బ పెట్టినాడు. ఆ బొబ్బలో నతని మనస్సు 'నే నెవడ'ను నొక ప్రశ్న మేళవించినది.

ప్రకృతి ప్రతిధ్వనించినది.

మరుక్షణము తన నిరంతరోచ్ఛ్వాస నిశ్వాసములచే నిత్యనూత్న మగుచున్నట్లున్న ప్రకృతిపరిణామ రామణీయకమును జూచి అంతలో నాశ్చర్యచకితుడు, నంతలో నానందపరవశుడు నగుచున్నాడు.

అర్ధనిమీలిత నేత్రుడై ఆ ప్రకృతిగతి పైన తన మనుగడ యాగము నన్వేషించుచున్నాడు.

'నే నెవడను?
ఎక్కడనుండి నా రాక?
ఎక్కడికి పోక?
ఎట్లు వచ్చితిని?
ఎందులకు?
..................

అంతు పట్టని యా ప్రశ్న పరంపర.

ఆలోచించిన కొలది అతనిలో ఆరాట మెక్కువగుచున్నది. హఠాత్తుగా తా నెక్కడనుండియో రెక్కలూడి యిక్కడ పడిపోయినట్లు బుజము లొకపరి తడుముకొనినాడు.

పక్షులు కిలకిల లాడినవి.

ఆః! తన వెనుకనో జారిపోయినట్లు అడుగుక్రింద తడుముకొన్నా డొకపరి.

కిశోరములు కిచకిచ లాడినవి.

ఏమిటీ పక్షులు!
ఏమిటీ జంతువులు!
ఏమిటీ చెట్లు, చేమలు! కొండలు, కోనలు! నదీనదాలు!
కొన్ని చలనము లేనివి!
కొన్ని చలన మున్నను చైతన్యము లేనివి!
కొన్ని చలనము లేకయే చైతన్యవంతములు!
కొన్ని చలనమును, చైతన్యమును గలవి,
తనవలెనే కనులు, చెవులు, ముక్కునోరును గలవి,
కాని తన్ను చూడ వేమి?
అవి యేవేవో ధ్వనుల నొనర్పగల్గుచున్నవి
కాని తన్ను పలుకరించ వేమి?

పోనీ తాను తన్నంత పలుకరించుటకు గూడ వెట్టించుకొని పక్షులు, జంతువులు వాని మానవవి పోక అల్లంత దూరమునుండియే తనవంక తదేక దృష్టితో నట్లు చూచుచున్న వేల!

ఈ లోకములోనికి తన రాక వానికిని ఆశ్చర్యము కలిగించినది కాబోలును!

ఈ ప్రకృతికిని తనకు నేమిటి సంబంధము?
ఈ ప్రకృతి కింత యంద మెక్కడినుండి వచ్చినది?
ఈ అంద మంతటిని తనదిగా నేల చేసికొనరాదు?
ఇదంతయు తన యనుభవమునకు వచ్చుటెట్లు?
అస లిదంతయు తన యనుభవమునకు రావలె ననిపించు టేల?
ఏమిటీ కోరిక?
ఎక్కడ దీని ఉత్పత్తి?
ఈ ప్రకృతి తనది కావలెనన్న ఏమి చేయవలె?
అస లిది యిప్పుడు తనది కాదా?
మరి యెవరిది?
దీనికి వేరే ఒక అధికారి యున్నాడా?
ఉన్నాడు కాబోలు!
అతడు తనకంటె అధికుడా?
కాబోలు!
అతనికి నాలుగేసి చేతులును బుఱ్ఱలు నుండునా యేమి!
ఉన్నది కాబోలు!

తాను వతని ప్రకృతిలోని యొక భాగమా!

మరి యతడెక్కడినుండి యూడిపడినాడు? ఎప్పుడు?

ఏడీ అతడు?

ఎక్కడున్నా డిప్పుడు?

ఎటు చూచినను అతని జాడయైన కనపడదేమి? బయట?

తన లోపలగాని దాగొని యున్నాడా అతడు?

లేక యేదో మాయక్రమ్మినదో మరపు వచ్చినదో కాని యతడే కాడా!

అంతకంత కనంత ప్రకృతి రహస్యములనుగురించి అంతులేని యాలోచనలు వింత వింత విచికిత్సలు చెలరేగుచున్న వతనిలో.

ఎండ గద్ది స్తీ మండిల పీదండిలపైనది నధిన్ను.

అతడు క్రమ క్రమముగా సమాధ్యవస్థలో ప్రవేశించినాడు.

మార్తాండ మండలము నొక పరివేష్ట మావహించినది.

మధ్యాహ్నము గడచినది. సాయంతనమైనది. చీకటి పడినది.

అతడు లేవలేదు.

దినములు, మాసములు, వాసరములు గడచినవి.

అతనిట్లే యుండెను.

ఎండలు కాసినవి. గాడ్పులు వీచినవి.

మొయిళ్ళు ముసిరినవి. వానలు కురిసినవి.

అతడు చలింపలేదు.

అతని చుట్టును పుట్టలు బలిసినవి.

సుబురుగా పెరిగిన అతని కొప్పులో పిచ్చుకలు గూళ్ళు గట్టుకొన్నవి.

అతడు చలింపలేదు.

ఒక ఆషాఢవాసర ముషఃకాలమున అకస్మికముగ గగనము గర్జించినది.

గిరి గహ్వరములు మారెలు గిచ్చినవి.

అతనిలో హఠాత్తుగా నొక బాహ్యస్పృహ కలిగినది.

కుబుస మూడ్చిన నాగువు వలె పుట్టనుండి బయల్వెడలినాడు.

సుందరతరము లయిన ప్రకృతి స్ఫురణల బరికించినాడు.

అతని కిప్పుడేమి చేయుటకును దోచలేదు.

అట్లు కింకర్తవ్యతా మూఢుడై యున్న అతనిలో నప్పటి కప్పుడొక కర్తవ్యబోధ యంకురించినది.

అతని యంతరంగమున అగ్నిభట్టారకు డొకపరి యావులించినాడు.

సమాధి భ్రష్టుడయిన యోగివలె అత డటు నిటు చూచినాడు.

అల్లంత దూరమున నొక యామ్రశాఖపై నొక బాలవానరం ఫలాస్వాదనము చేయుచున్నది.

ఆ చెట్టు కొమ్మలనుండి ఇంక నేక ఫలములు గుత్తులు గుత్తులుగా వ్రేలుచున్నవి.

అతడొక రాయితీసి ఒక గుత్తికి గురిచూచి విసరినాడు.

ఒక పండు త్రుళ్ళి ఎచ్చటనో పడింది.

పండు పడిన దెస కతడు పరువెత్తినాడు.

ఆశ్చర్యము! అటనొక తరుచ్ఛాయ—నొక శిలాతలమున సుఖాసీనయై మరియొక వ్యక్తి.

ప్రకృతి యందమంతటికి ప్రతినిధివలె నున్నది.

ఆ వ్యక్తికి దనకు నాకార పరిమాణములలో నించుకంత భేద మున్నను నది యేమిటో ఆ వ్యక్తిని జూచుటతోడనే అతనికి తన యొంటరితన మంతయు బోయినట్లనిపించెను.

ఆశ్చర్యముతో నతడొక్కపరి బిట్టార్చినాడు.

ఆ అవ్యక్త మధురధ్వనిలో 'ఇంతకాలము నీకోసమేనా నే నెదురుచూచుచున్నది!' అను భావ ముపహ్నూతమైనది.

ప్రకృతి ప్రతిధ్వనించినది.

అతని గొంతుచెర విడినది.

అపహ్నూతభావ ముపన్నమైనది.

ఆకాశవాణితో నతని యంతర్వాణి జరుపు రాయబారముల మార్గమధ్యమున అతని జిహ్వాగ్రమున వాణి యావహించినది.

అతని మూగసైగల కర్థము లేర్పడినవి.

అర్థములకు శబ్దసంకేతము లేర్పడినవి.

అత డాశించిన ఫల మామెయొడిలో బడియున్నది.

అత డామెను దానిపండిమ్మని యడిగినాడు.

ఆమె ముసిముసి నవ్వులు నవ్వుచు, సిగ్గులు చిలుకరించుచు ఇరువురమును బంచుకొందమన్నది.

అతడు సమ్మతించినాడు.

ఇరువురును పండు పంచుకొని యారగించినారు.

టెంకదగ్గర తగవు తెగలేదు.

అసలది కొరుకబడలేదు.

అట్లని దానిని పారవేయుటకు వారికి మనస్కరించలేదు.

అట మట్టిలో నొక చిన్నగోయి తీసి అందు దాచివైచినారు.

ఇరువురు నెదురెదురుగాకూర్చుండి యొకరినొకరు తెగాదిగ చూచుకొనుచున్నారు.

ఉండి యుండి 'నీవెవ్వరవ'ని యడిగినా డతడు.

ఆమె తెలతెలబోయినది.

ఉండు మిపుడే తెలిసికొనివచ్చి తెలిపెదనన్నట్లుగా ఎచటికో లేచిపోయినది.

సాయంకాలమైనది. ఆమె రాలేదు.

చీకటిపడినది. ఆమె రాలేదు.

ఆమె రాకున్న తన కెందులకీ యారాటము!

ఆమెకు దనకు నేమి సంబంధము!

ఏమిటీ చీకటి!

ఇంత వెలుగు నొక్కపరి యెట్లంతర్ధానమైనది!

అదే అదేమిటా వెలుగు!

చిత్రము! వెలుగువెంట చీకటి! చీకటిలో వెలుగు!

చల్లని వెలుగు!

వెలుగునకును వేడియు జలువయు గలవా!

ప్రకృతి ఏమింత ప్రశాంతముగా నున్నదిప్పుడు!

కాని తన మనస్సులో నేమిటో కలవరము!

చల్లని వెలుగులో వెలుగు చలువకు తన యొడలు పులకరించియు భావవాడిలో వేడి యనుభవించుచున్న దేమి! ఆ వేడి వెలుగు తనలోనే లీనమై అంతరించినదా!

చల్లని వెలుగులో ప్రకృతి సౌందర్య మంతకంత కగ్గలమగు చున్న ట్లున్న దేమి!

అసలా ప్రకృతి సౌందర్య మినుమడించుచున్నదా? లేక తన కేదో యట్లనిపించుచున్నదా?

ఆ చల్లని వెలుగెక్కడనుండి వచ్చుచున్నది?

ఆ తెల్లని బిళ్ళనుండా?

ఆకసమునుండియే కాక ఆ సరస్సులోను అట్టిబిళ్ళ యొకటి అగపడుచున్న దేమి!

ఆమె ఏది? ఎక్కడికి పోయినది?

ఆచీకటి వేళ గాని తనలో ప్రవేశించి దాగొన్నదా!

ఆకస మంతట నేమిటీ లెక్కలేని చుక్కలు!

ఒక్క మాదిరివే అన్ని చుక్కలా!

ఆ చుక్కల కన్ని కాంతులా!

ఆ చుక్కల కాలంబ మెక్కడ?

ఆకాశ మెంత విశాలమైనది!

శూన్య మెంత సుందరమైనది!

* * *

తూరుపు రూపురేకలు బహుధా విధూమ్ర వికస్వరములైనవి.

అతని యూహావిహంగము లాశా వైహాయస పథముల విహరించుచున్నవి.

అంతలో ఆకసమున నొక మూల నొక యాషాఢ మేఘము మూల్గిన సవ్వడి.

అది,యేదో తన్ను పల్కరించుచున్న దనుకొనినా డా వెర్రి బాగులవాడు.

తానును దానితో నేదో మాటలాడ బోయినాడు—

'ఏదీ నా ఎదలోపలి యెద

మధురాతి మధుర ఫలప్రద—

నా గుండెలు ఝల్లన

చల్లని చూపుల వెలుగుల

జల్లున విదజల్లిన చేడియ—

నా గొంతుకలో నవవసంతము

నావిష్కృత మొనరించిన

దేవత—

ఏ కడ! జొచ్చినదో!

ఆ కసమున చుక్కలలో!

చీకటిలో నా చిత్తములో!

ఎవరో నా యెద తట్టిన స్వామీ

నా సొద నామెకు

నీవైనా నివేదించు'

తివ్వర నొక గాలి తివట మొగిలు మొవ్వులోనికి దూసుకొని పోయినది.

అపుడా మొగిలు మొవ్వునుండి యూడిపడి నల్లామె అతని యెదుట సాక్షాత్కరించినది.

అతని సంతోషమున కంతులేదు.

కాని ఆషాఢ మేఘ మొక యార్భాటము చేసినాడు. ఉండి యుండి ప్రళయోద్దండముగ నొక్క యురుము రిమినాడు.

ఇరువురును బెగ్గడిల్లి యొకరినొకరు బిగ్గ కవుంగిలించుకొనినారు.

ఆ క్షణమున వారి తనువుల నణు వణువున శతకోటి విద్యుత్తులు ప్రసరించినవి.

ఉరుము మడిగినను ఆ పట్టినపట్టు వదలక వారట్లే సొక్కిపోయి కనుమూసిరి.

నిద్దురలో నిద్దరికి నొక్కటే కల వచ్చినది—

వారు నాటిన విత్తు మొలకెత్తినది

ఆ మొక్క పెరిగి శాఖోపశాఖలై మూడు పూవులు నారు కాయలుగా నొక మహావృక్షముగా రూపొందినది.

అది పరిపక్వ ఫలప్రచురమై ఆకాశకోశములకు విస్తరిల్లినది.

ఆ నేక జీవరాసుల కాశ్రయమైనది.

కాని పాపము కలి ప్రవేశించిన కొలది కాలములో నొక యకాల ప్రళయ ఝంఝ దానిని సమూలముగా గంపింప జేసినది.

శాఖము లాక్రోశ మొనర్చినవి.

పక్షులు విలవిల లాడినవి.

కలలో మనస్సు కలగుండు వడి ఇరువురు నిదుర చెదరి మేల్కాంచిరి.

నభస్సు మొగము నుషస్సు నవ్యరోచిస్సుల నలం[illegible]చున్నది.

ఇరువురు నొకరి నొకరు చూచుకొనిరి.

ఆమె కెక్కడినుండియో చెప్పలేని సిగ్గు వచ్చిపడినది. చర చర నొక సమీపస్థ కుధరగుహాకుహరమున ప్రవేశించినది.

ఆ వెలుగులో నొక మరుగులేక ఇక నిప్పుడామె తన యెదుట తనువు జూపింప జాలదని యతడు గ్రహించినాడు.

అతనిలోను ఏదో సిగ్గు అంకురించినది.

నేడిట్లు సిగ్గు పొడసూపుటకు మూలకారణము నిన్న రాతిరి సన్నివేశమనియు నతడు గ్రహించినాడు.

ఆ సన్నివేశముతోనే అతనిలోని చైతన్య మంతయు పూర్తిగా ఆవిష్కృతమైనది.

ఈ లోకములో తానొనర్పవలసిన పను లనేకము గలవని గ్రహించినాడు.

సూర్యునివంక చూడగలిగినంత నేరుపు మొగమెత్తి చూచుచు నొక కర్తవ్యబోధ నెదురుచూచు చున్నాడు.

అతనిచుట్టు నొక మహాతేజస్సు వెలిగిపోవుచున్న దిపుడు.

ఆవేళ గగనమార్గమున కొందరు గంధర్వ యక్ష సిద్ధ విద్యాధరాదు లటు పోవుచుండిరి.

అందరు వతనిజూచి యాశ్చర్యచకితులైరి.

'అత డెవడా?' యను నొక పెద్ద ప్రశ్న యుదయించినది వారికి.

'ఒక నూత్న పశువిశేషమ' మని యొకరి శంకగా.

'కాదు కాదితడు పశుపతిసమాను' డని వేరొకరు.

'ఇతడు దానవుడు'.

'కాదు కాదు దైవసమానుడు.'

'ఇతడొక నవ్య ప్రజాపతి'

'కాదు ప్రళయరుద్రుడు'

'ఇతడొక మహర్షి!'

'ఇతడొక మహాకవి!'

పరిపరివిధముల పరుగులెత్తుచున్నవి వారి యూహాలు.

ఒక సిద్ధు డనతిదూరముననున్న యొక వానరునివైపు, కన్నెదుట నున్న యొక కిన్నరునివైపు నొకపరి పరికించి యానడుమ చూపు నిగిడ్చి,

'ఇతడు న...రు...డు' అని వక్కాణించినాడు.

'అవునవును. ఇటీవల బ్రహ్మగా రద్భుతముగా నొక అపూర్వ వ్యక్తిని సృజించినారనియు, ఆ వ్యక్తి చరిత్ర భూలోకమున కొన్ని యుగములపాటు విచిత్రముగా ప్రవర్తిల్లగలదనియు, ఆ మహా చరిత్రను సంగ్రహించుటకు ప్రత్యేకముగా చిత్రగుప్తుని నొక గొప్ప యుద్యోగి నియుక్తుడైనాడనియు వింటి'నని యందు కొక్కడింకొక సిద్ధుడు.

'ఇదం ధ్యాత్వా పృథివీ సత్యమస్తు
పితర్మాతర్యది హోప బ్రువే వాం
భూతం దేవానా మవమే అవోభిః
విద్యామేషం వృజనం జీరదానుమ్.'

***

